సమస్యల సుడిగుండంలో.. జర్నలిస్ట్‌కాలనీ

- పట్టించుకోని అధికారులు
- స్థానికుల అవస్థలు
- అస్తవ్యస్తంగా మురుగునీటి వ్యవస్థ
- సరిపడా తాగునీరు లేక ఇక్కట్లు
- అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లు



జర్నలిస్ట్‌కాలనీలో అంతర్గత రోడ్ల పరిస్థితి







శిథిలమైన మ్యాన్‌హోళ్లు



పేరుకుపోయిన చెత్త



ధ్వంసమైన పైప్‌లైన్‌లు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి జర్నలిస్ట్‌కాలనీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీ సొసైటీ నిధులు రాక, ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ అవసరమైన మేరకు నిధ/లు కేటాయించకపోవడంతో బస్తీలకంటే అధ్వాన్నంగా మారిందని వారు వాపోతున్నారు. మంచినీటి, మురుగు నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలోని బస్తీలో పూర్తి స్థాయి వసతులు కల్పిస్తున్న అధికారులు తమ కాలనీ పట్ల నిర్లక్ష్యం చేయడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

- కాలనీలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది.
- మే నెల వరకు సరఫరా బాగానే ఉన్నా, జూన్, జూలై నెలల్లో నీరు అందడం లేదు.
- ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కాలనీకి అవసరమైన మేరకు నీటి సరఫరాను చేస్తున్నట్లు చెబుతున్నారన్నారు.
- కాలనీ భూగర్భ జలాలు అడుగంటడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు.
- ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

డ్రైనేజీ సమస్యతో నిత్యం ఇక్కట్లే

- డ్రైనేజీ సమస్యతో స్థానికులు నిత్యం ఇబ్బదులు పడుతున్నారు.
- డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్యలు అధికమవుతున్నాయి.
- మ్యాన్‌హోల్స్ శిథిలమైనా పట్టించుకునేవారు కరువయ్యారు.
- మురుగునీరు ప్రధాన రహదారిపైకి చేరడంతో దుర్గంధం వ్యాపిస్తోంది.
- ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
- అధ్వానంగా అంతర్గత రహదారులు
- కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారిపోయాయి, కనీసం మరమ్మతులు చేయకపోవడం, రోడ్లు శుభ్రపరిచే సిబ్బందిని నియమించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.
- కాలనీలో రోడ్లు గుంతలమయంగా మారడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- కాలనీలో పార్కుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.
- వీటితోపాటు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రోస్టేట్ కేన్సర్ బాధితుడికి అరుదైన చికిత్స

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన ప్రోస్టేట్ కేన్సర్‌తో బాధపడుతున్న 72 ఏళ్ళ వ్యక్తికి విజయవంతంగా చికిత్స అందించారు. ఆస్పత్రి మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ కేవీ కృష్ణమణి మంగళవారం వివరాలు వెల్లడించారు. 2014 నుంచి మూత్ర విసర్జన సమస్యను ఎదుర్కొంటున్న వ్యక్తికి తమ వైద్య బృందం ఎన్ఎస్‌జీ/మాలిక్యూలర్‌టెస్టింగ్/ ఇమ్యునో థెరపీ చికిత్స అందించిందన్నారు. ఈ సమగ్ర విధానం కేన్సర్ సమస్యను పరిష్కరించడమే కాకుండా అతని జీవన ప్రమాణాన్ని సైతం పెంచిందని గుర్తు చేశారు. ఈ వయస్సులో ఉన్న రోగికి ఈ అరుదైన చికిత్స విజయవంతంగా అందించడం, అద్భుతమైన ఫలితాలను సాధించడం ప్రపంచవ్యాప్తంగా అతికొద్ది కేసుల్లో ఒకటిగా ఆయన పేర్కొన్నారు. సీటీఎస్ఐ దక్షిణాసియా సీఈఓ హరీష్ త్రివేది మాట్లాడుతూ ఈ కేసు కేన్సర్ చికిత్సలలో అత్యాధునిక మాలిక్యూలర్ డయాగ్నస్టిక్స్ ప్రాముఖ్యత ను వివరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓఐ రీజనల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్, ఇతర వైద్యబృందం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుడా కాలనీలో కనీస వసతులు కల్పిస్తానని, మంజీరా పైప్‌లైన్ రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రయాణికుల భద్రతే ధ్యేయం



ఉత్తమ డ్రైవర్లతో ట్రాఫిక్ ఎస్ఐ వీరబ్రహ్మం, డీఎం మురళీధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రమాద రహితంగా బస్సులు నడపడమే ఆర్టీసీ డ్రైవర్లు లక్ష్యంగా పనిచేయాలని గచ్చిబౌలి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ వీరబ్రహ్మం అన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన డిపో ఆవరణలో మంగళవారం ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదరహితంగా బస్సులను నడిపిన డ్రైవర్లను సన్మానించి రివార్డులను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డుపై వెళ్లే వాహనాల్లో ఆర్టీసీ బస్సు ఒకటని అందుకే మరింత జాగ్రత్తగా, అప్రమత్తంగా బస్సులను నడిపే బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. బస్సులను మంచి కండీషన్‌లో ఉంచే బాధ్యత మెకానిక్‌లు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతియేటా ఆర్టీసీ డిపోల వారీగా ప్రమాదరహిత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో అధికారులు పలువురు సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 40, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 40, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 280.

ఘనంగా దుర్గమ్మ జాతర

పటాన్‌చెరు: ప్రతి రెండేళ్లకు ఒకసారి ఆషాఢ మాసంలో మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించే దుర్గమ్మ ఉత్సవాలు చిట్కుల్‌లో మంగళవార ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాల్లో మొదటిరోజు కట్ట మైసమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ నేత నీలం మధు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం దుర్గమ్మకు, గురువారం పోచమ్మకు భక్తులు బోనాలు సమర్పించనున్నారు. బుధవారం సాయంత్రం ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో ఫలహారం బండి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించండి



స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: కాలనీల్లో అంతర్గత రహదారులపై ఆక్రమణలను తొలగించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బొటానికల్ గార్డెన్ రోడ్డు, చందానగర్ సర్కిల్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్, అపర్ణ రోడ్లను పరిశీలించారు. రహదారులను ఆక్రమించి ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలన్నారు. రహదారులకు ఇరువైపుల పేరుకుపోతున్న చెత్త, గ్రీన్ వేస్టేజ్‌ను ఎప్పటికప్పుడు తరలించాలని వైద్యాధికారిని ఆదేశించారు. రహదారులపై ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్చాలని, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన డివైడర్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. బొటానికల్ గార్డెన్ ఎదురుగా ఉన్న గుడిసెలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డీసీ రజినీకాంత్ రెడ్డి, ఏసీపీ మెహర, ఏఎంఓహెచ్ డాక్టర్ కార్తీక్ డీఈ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మియాపూర్: మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు,ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి మంగళవారం కూల్చివేశా. రెడ్డి కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన రెండు భవన నిర్మాణాల స్లాబులను కూల్చివేశారు. కాలనీలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు ఉన్న వాటిని పట్టించుకోకుండా 5 అంతస్తుల్లో నిర్మాణాలు చేపట్టారు. అయితే కేవలం రెండు నిర్మాణాలను కూల్చివేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నారు.

నల్లగండ్ల మార్కెట్‌లో ఘనంగా బోనాలు



బోనాల వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్లు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో మంగళవారం ఎల్లమ్మ,పోచమ్మ అమ్మ వార్ల బోనాలు ఘనంగా జరిగాయి. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. మహిళా భక్తులు బోనం ఎత్తి అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఆర్‌సీపురం కార్పొరేటర్ పుష్పానగేష్ అమ్మవారిని దర్శించుకుపి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వీరేశంగౌడ్, ఖాజాపాషా, ప్రభాకర్‌రెడ్డి, అస్లామ్, అజీమ్, శ్రీనివాస్, వెంకటేష్, రాజు, రాంచందర్, లాల, బాబుజానీ, మోయిన్, దత్తరెడ్డి, శివముదిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు

హఫీజ్‌పేట్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం గ్రామంలో మంగళవారం ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం నేపథ్యంలో అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వేడుకుంటున్నానన్నారు. నియోజకవర్గంలోని వాడవాడలో బోనాల జాతర వేడుకలను ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో నియోజకవర్గంలో ప్రతి దేవాలయానికి నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ రెడ్డి, గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ ఆటోమేషన్ పీజీ ప్రోగ్రాం ప్రారంభం

మాదాపూర్: నెక్టస్ జనరేషన్ టెక్ నిపుణులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పెగాసిస్టమ్స్, బ్లాక్‌బక్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. మంగళవారం డిజిటల్ ప్రాసెస్ ఆటోమేషన్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించాయి. ఈ సందర్భంగా పెగా సిస్టమ్స్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ దీపక్ విశ్వేశ్వరయ్య మాట్లాడుతూ డిజిటల్ ప్రాసెస్ ఆటోమెషీన్‌లో అత్యాధునిక పోస్ట్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేయడం లక్ష్యమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన బీటెక్, ఎంటెక్, మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్‌లను ప్రత్యేక నైపుణ్యాలతో సన్నద్ధం చేయనున్నట్లు తెలిపారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ చేసిన నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏక కాలంలో రైతులకు రెండు లక్షల రుణ మాఫీ, సుమారు 31వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించి ఇప్పటికే 12వేల కోట్లను రుణమాఫీ చేశారన్నారు. మిగతా బకాయి ఆగస్టులో చేస్తారని చెప్పారు. అదేవిధంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పదివేల కోట్లు, కార్పొరేషన్‌కు రూ.3,500 కోట్లు, జలమండలికి రూ.3,300 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సమ్మయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్ మోరే, పట్టణ కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొండా విజయ్ కుమార్



నూతన కమిటీని అభినందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, సలీం తదితరులు

హఫీజ్‌పేట్ : తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే -ఐజేయూ) సంఘం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొండా విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మియాపూర్ ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని వీఆర్ అశోక్ గ్రాండ్ హోటల్‌లో ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు సలీం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కిషన్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కొండా విజయ్ కుమార్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా అశోక్ యాదవ్, ప్రణబ్, డి.శ్రీనివాస్, కోశాధికారిగా వరుణ్, జాయింట్ సెక్రటరీలుగా గోవర్ధన్‌రెడ్డి, సాద నరేష్, ప్రవీణ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మల్లేష్, శంకర్, నాగరత్నం, ఎండి యాసిన్, రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు మాధవరెడ్డి, శ్యాంసన్, శ్రీనివాసులు గౌడ్, దారుగుపల్లి సత్యనారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం సర్వే షురూ...



జీఐఎస్ సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ఇంటి ఆస్తుల సర్వేను మంగళవారం చందానగర్ డివిజన్ పరిధిలోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, సర్కిల్ 21 ఏఎంసీ కృష్ణ, జీఐఎస్ సర్వే అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఇంటిగ్రేటెడ్ బయోగ్రఫి ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ఇంటి ఆస్తుల సర్వే ద్వారా పట్టణ నిర్వహణ మెరుగుపర్చడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జూలై 30 నుంచి ఈ సమగ్ర సర్వేను నగరంలో నివాసముండే అందరి ప్రయోజనం కోసం పట్టణ డేటా నిర్వహణ సమర్థవంతమైన , పారదర్శక వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. సర్వేకు ప్రజలందరు సహకరించాలని కోరారు.

రెండు సర్వే బృందాలు....

జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆస్తుల సర్వే కోసం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో చందానగర్ సర్కిల్ 21లో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్లు ఏఎంసీలు కృష్ణ, విజయ్ తెలిపారు. ఒక్కో బృందంలో ఇద్దరు సర్వేయర్లు ఉంటారని ప్రతి ఇంటికి వెళ్ళి కొలతలతో పాటు డ్రోన్ల సహాయంతో ఇంటి చుట్టు తిరుగుతూ సర్వే చేస్తారన్నారు. సర్వేయర్లకు ఇంటికి సంబంధించిన అనుమతులు, ఓసీ సర్టిఫికెట్ ఇతర గుర్తింపు పత్రాలు చూపించాలని కోరారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

పటాన్‌చెరు టౌన్: బీరంగూడ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. స్థానిక వ్యక్తి సిద్ధార్థ మంగళవారం ఉదయం ఆ టిఫిన్ సెంటర్ నుంచి ఇంటికి టిఫిన్ తీసుకెళ్లాడు. పార్సిల్ విప్పిచూడగా చట్నీలో పురుగులు కనిపించాయి. దీంతో ఆ విషయాన్ని హోటల్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. బాధితుడు ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. స్క్వాడ్ రాష్ట్ర స్థాయి అధికారి శ్రీషిక తన సిబ్బందితో వచ్చి టిఫిన్ సెంటర్‌ను పరిశీలించారు. నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న విరాహత్ అలీ

హఫీజ్‌పేట్ : జర్నలిస్టులకు ఇళ్ల మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అన్నారు. మంగళవారం ఆల్విన్ కాలనీ చౌరస్తాలోని వీఆర్ అశోక్ గ్రాండ్ హోటల్‌లో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీకి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ గత పదేళ్లుగా విలేకరుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. దేశంలో జర్నలిస్టుల గొంతుకగా పోరాటం చేస్తున్న కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందున జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందన్నారు.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో తరచూ సమచార శాఖ మంత్రితో విలేకరుల సమస్యలపై సమావేశాలు, చర్చలు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని కోల్పోవడంతో సరైన వైద్య సదుపాయాలు అందక పలువురు విలేకరులు ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టుందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేసేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు సలీం మాట్లాడుతూ జర్నలిస్టులు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారని, జర్నలిజాన్ని కొందరు వ్యక్తులు వ్యాపారంగా చూస్తున్నారన్నారు.కార్యక్రమంలో నాయకులు సలీం, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్ శిగా, బాలరాజు, రాజేష్, కిషన్, సత్యనారాయణ, శ్రీనివాస్ రావు, నాగవేందర్‌రెడ్డి, శ్రీనివాసులు గౌడ్, దారుగుపల్లి సత్యనారాయణ, కొండా విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి, మాధవరెడ్డి, శ్యాంసన్, ప్రణబ్ ముదిరాజ్, అశోక్ యాదవ్, వరుణ్, డి.శ్రీనివాస్, నరేష్, ప్రవీణ్, నగేష్, గోవర్ధన్ రెడ్డి, శంకర్, యాసిన్, రమేష్ పాల్గొన్నారు.

వీధి దీపాలపై నిరంతర పర్యవేక్షణ



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ పరిధిలో వీధిదీపాల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షించాలని శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ కార్యాలయంలో జోన్ పరిధిలోని వీధిదీపాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిచేయని వీధిదీపాలు స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులతోపాటు కాలనీ అంతర్గత రోడ్లపైన ఎక్కగ వీధి దీపాలు పని చేయకపోయినా వెంటనే మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధిదీపాల సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయని, ఆగస్టు 3గా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. నిత్యం వచ్చే ఫిర్యాదులను ప్రాంతాల వారీగా విభజించి స్థానిక సిబ్బందితో కలిసి పరిష్కరించాలన్నారు. ట్విటర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దని జోనల్ కమిషనర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జోన్ పరిధిలోని ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.